నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 10 జూలై 2024 | KAMAREDDY

## నాలుగు నెలల నుంచి బిల్లులు లేవు



మద్నూర్, జూలై 9: నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రాలే దు. 2024 జనవరి వరకు మాత్రమే బిల్లులు వచ్చాయి. ఉపాధ్యాయులను అడిగితే వస్తాయని అంటున్నారు. ఇప్పటి వరకు రాలేదు. బయటి నుంచి అప్పులు తీసుకువచ్చి వండుతున్నాము. సకాలంలో బిల్లులు వస్తే, మాకు ఎలాంటి అప్పులు కావు.

**- శాంతాబాయి, మద్నూర్**

## బకాయిలను విడుదల చేయాలి



మద్నూర్, జూలై 9: బిల్లులు రాకపోవడంతో అప్పులు చేస్తున్నాం. నెలనెలా బిల్లులు వస్తే సమస్యలు రావు. అన్నీ తీసుకువచ్చి పెట్టుమంటున్నారు. గుడ్లకు సంబంధించిన బిల్లులు రాలేదు. తాము ఎక్కడి నుంచి తీసుకురావాలి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

**-సులోచన, చిన్నటాక్లి**

# గాడితప్పిన విద్యావ్యవస్థ

## మన ఊరు-మన బడిపై నిర్లక్ష్యం

- పేరు మార్చినా జరగని అభివృద్ధి పనులు
- ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలు
- సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పట్టు
- సమాధానం ఇవ్వలేక కాంగ్రెస్ పాలకుల దాటవేత

**విద్యా వ్యవస్థలో సమస్యలు** పేరుకుపోయాయి. పాలకుల నిర్లక్ష్య వైఖరి పేద, మధ్యతరగతి, సామాన్య కుటుంబాలకు శాపంగా మారింది. అరకొర వసతులు, టీచర్ల కొరత, పాఠ్య పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యం, దుస్తుల కొరత, తాగునీటి ఇబ్బందులు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం పట్టి పీడిస్తున్నాయి. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో పూర్తిస్థాయిలో సమీక్షించాల్సిన వారు కూడా లేకుండా పోయారు. దీంతో కిందిస్థాయిలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సామాన్యులకు విద్యను దరిచేర్చారు. పాఠశాల విద్యను మొదలుకొని ఉన్నత విద్య వరకు ప్రాధాన్యమిచ్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం సర్కారు బడులను పట్టించుకోవడం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

–నిజామాబాద్, జూలై 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి)




వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు



పాఠశాలల పునఃప్రారంభం నాటికి నిజామాబాద్ నగరంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న పనులు (ఫైల్‌ఫోటో)

## బిల్లులు చెల్లించండి సారూ..

మోర్తాడ్, జూలై9: ఐదు నెలల మధ్యాహ్నభోజన ఏజెన్సీ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ మండల విద్యావనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి మాట్లాడుతూ అప్పుచేసి మధ్యాహ్న భోజనం పెడుతున్నామని అన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లు, నిత్యావసర సరకులు, గ్యాస్‌ను సప్లయ్ చేయాలని, కార్మికులకు వేతనం రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఎంఈవో ఆంధ్రయ్యకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ మండల అధ్యక్షురాలు బాబాయికవిత, పోసాని, వరలక్ష్మి పాల్గొన్నారు.

### అల్పాహారం ఆవిరి..

మానవీయ కోణంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి బ్రేకులు పడ్డాయి. 2023లో ప్రారంభమైన ఈ స్కీమ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపేసింది. ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఆకలిని తీర్చేందుకు గత ప్రభుత్వం ప్రతి స్కూల్‌లోనూ టిఫిన్స్ అందించేలా ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం నిజామాబాద్ జిల్లాలో 1180 ప్రభుత్వ స్కూళ్లలో, కామారెడ్డి జిల్లాలో 1011 ప్రభుత్వ బడుల్లో అమలవుతున్నది. దీంతోపాటు ఒకటి నుంచి పదో తరగతి వరకు అల్పాహారం పథకాన్ని గత ప్రభుత్వం అమలుచేసింది. సర్కారు స్కూల్‌కు వెళ్లే వారందరికీ అల్పాహారం, మధ్యాహ్న భోజనం చదువుతోపాటే ఉచితంగానే అందుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం కాగా దాదాపుగా ఉమ్మడి జిల్లాలో 2లక్షల పైచిలుకు విద్యార్థులకు లాభం చేకూరింది. అధికారం మారడంతోనే కాంగ్రెస్ సర్కారు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నిలిపేసింది. అర్ధాకలితో సర్కారు స్కూళ్లకు వచ్చే వారికి ఆకలి బాధలు తప్పడం లేదు. మధ్యాహ్న భోజనం వరకు కడుపు మాడ్చుకొని కూర్చోవాల్సి వస్తున్నది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ కొనసాగించడంపై తల్లిదండ్రుల నుంచి విన్నపాలు పెరుగుతున్నాయి. ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. అల్పాహారం అందించడంతో డ్రాప్ అవుట్స్ తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

### మరిన్ని సమస్యలివిగో...

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విధులు నిర్వహిస్తున్న వంట మనుషులు, సహాయకులకు నెలలుగా పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదు. వీరికి నెలకు రూ.3వేలు చొప్పున అందించాల్సి ఉంది. 2024 జనవరి నుంచి జూన్ వరకు 5 నెలలుగా వేతనాలు రాలేదు. పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారు. తొమ్మిది, పదో తరగతికి సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు జనవరి, 2024 వరకే అందించారు. మిగిలిన నెలలకు బిల్లులు మంజూరు చేయలేదు. 1 నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజన బిల్లులు ఏప్రిల్ 2024 వరకు వచ్చాయి. మిగిలిన బిల్లులు రాలేదు. ఎస్జీటీ బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామని గతంలో పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారు. కానిప్పుడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటికీ తానిచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోతున్నాడు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తామని చెప్పినా ఏదీ కాలేదు. గతంలో జీపీలు నిర్వహించే బాధ్యతను అమ్మ కమిటీలకు అప్పగించగా మాటలకే పరిమితమైంది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 1180 స్కూళ్లకు రూ.170కోట్లతో 407 స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపిక చేసి చాలాచోట్ల పనులు పూర్తిచేశారు. కామారెడ్డి జిల్లాలో 1011 స్కూళ్లు ఉండగా అందులో 185ప్రాథమిక, 42 ప్రాథమికోన్నత, 124 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 351 స్కూళ్లలో అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా జరగడం లేదు.

## అప్పు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నాం..



బోధన్ రూరల్, జూలై 9: రెండు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రావడం లేదు. మూడు నెలల నుంచి గౌరవ వేతనాలను కూడా నిలిపివేశారు. అయినప్పటికీ అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను మంజూరు చేయడంతోపాటు నెలనెలా బిల్లులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**- ఆయూబ్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు, ఊట్‌పల్లి**

## ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి..



బోధన్ రూరల్, జూలై 9: మా పిల్లలను సర్కారు బడికి పంపిస్తున్నాం. గ్రామంలోని పాఠశాలలో ఐదు తరగతులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. దీంతో బోధన కుంటుపడుతుంది. టీచర్ల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. కనీసం విద్యావలంటీర్లను నియమించి సిలబస్ ప్రకారం బోధన కొనసాగేలా ప్రభుత్వం కృషి చేయాలి. లేదంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంటుంది.

**- రఘు, రాజీవ్‌నగర్‌తండా, విద్యార్థి తండ్రి**

## అల్పాహారం పెట్టాలి..



బోధన్ రూరల్, జూలై 9: కేసీఆర్ ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఉదయం వేళ అల్పాహారాన్ని అందించింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలో అల్పాహారం పెట్టడం లేదు. దీంతో ఉదయం వేళ తినే సమయం దొరకక ఆకలితో పాఠశాలకు వస్తున్నాం. పాఠశాలలో అల్పాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి.

**- సంజీవ్, విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమ్దాపూర్**

## మళ్లీ టిఫిన్ పెట్టాలి..



రోజూ ఉదయం టిఫిన్లు పెట్టాలి. గత సంవత్సరం అల్పాహారం అందించడంతో ఉదయం పాఠశాలకు సకాలంలో వచ్చేవాళ్లం. పాఠశాలల ప్రారంభం నుంచి అల్పాహారం అందుతుందేమోనని ఎదురుచూస్తున్నాం. అల్పాహారం కింద ఇడ్లీ, ఉప్మా, పులిహోరతో పాటు పలురకాల టిఫిన్లు అందించారు. ఇప్పుడు కూడా అలాగే కొనసాగించాలి.

**- ఓమేరా బేగం, 4వ తరగతి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉర్దూమీడియం, బోధన్.**

## బిల్లులు రాకపోయినా భోజనం పెడుతున్నాం..



కోడిగుడ్ల బిల్లులు అందకపోయినా, గిట్టుబాటు కాకపోయినా, మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్లు అందిస్తున్నాం. గత జనవరి వరకు కోడిగుడ్ల బిల్లులను అందించారు. సుమారు నాలుగు నెలలు పూర్తయినా కోడిగుడ్లకు చెందిన బిల్లులు అందలేదు. అయినా, విద్యార్థులకు కోడిగుడ్లు అందిస్తూనే ఉన్నాం.మార్కెట్‌లో ఒక్కో కోడిగుడ్డు రూ.6 నుంచి రూ.7 వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వ పరంగా మాకు ఒక్కో గుడ్డుకు రూ.5 వస్తాయి. నష్టంతో అయినా గుడ్డు పెడుతున్నాం. అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తున్నది.

**- అఫ్సరీ బేగం, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, బోధన్**

## వేతనం రాకపోయినా పనిచేస్తున్నాం..



నెలవారీగా సకాలంలో వేతనాలు రాకపోయినా, పనులు చేస్తూనే ఉన్నాం. ఈయేడు మొదటి నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. పనులు వదులుకోలేక, వేతనంతోపాటు అప్పుడప్పుడు ఏజెన్సీ నిర్వాహకులు అందిస్తున్న సహకారంతో పనులు చేస్తున్నా. మాకు ఇచ్చే వేతనం తక్కువే అయినా..సకాలంలో అందితే మంచిగా ఉంటది. ప్రభుత్వం వేతనాలును వెంటనే చెల్లించాలి.

**- టి. సతీశ్, కుక్ కం హెల్పర్**

బొంకన్‌పల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



# పాఠశాల పనులు వేగంగా పూర్తిచేయాలి

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మాక్లూర్/నందిపేట్, జూలై 9: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మాక్లూర్, నందిపేట మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ మంగళవారం సందర్శించి పనులను పరిశీలించారు. మాక్లూర్ మండలం ముల్లంగి, బొంకన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటగది, వరండా, అదనపు గదులు, వాటర్‌సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆరా తీశారు. పాఠశాలల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరుపాలని సూచించారు. వానకాలం నేపథ్యంలో పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. నర్సరీని పరిశీలించారు. అనంతరం నందిపేట మండల కేంద్రంలోని డీఎస్, రాజానగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల, నర్సరీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సందర్శించా రు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారులు ముత్తెన్న, జగన్నాథచారి, పంచాయతీరాజ్ ఈఈ బావన్న, తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీవోలు జైక్రాంతి, కిరణ్, ముల్లంగి గ్రామప్రత్యేకాధికారి డాక్టర్ ఉమామ, ఏపీఎం అనిల్, ఏపీవో ఓంకార్ ఉన్నారు.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఖలీల్‌వాడి, జూలై 9: ఈ నెల 21న అరుణాచలంలో నిర్వహించే గిరిప్రదక్షిణకు నిజామాబాద్–2 డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు టీజీఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానిరెడ్డి తెలిపారు. బస్సు ప్రయాణం వివరాలను మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న రాత్రి 8 గంటలకు నిజామాబాద్ నుంచి బయల్దేరి 20న ఉదయం 10గంటలకు కాణిపాకం చేరుకొని విఘ్నేశ్వరుని దర్శనానంతరం సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ ఆలయం చేరుకుంటుంది. అనంతరం రాత్రికి అరుణాచలం చేరుకుంటుంది. గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21న సాయంత్రం 5గంటలకు అరుణాచలం నుంచి బయల్దేరి 22న ఉదయం 4గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుంది. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 6గంటలకు నిజామాబాద్ చేరుకుంటుంది. టికెట్ ధర పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3,400లు ఉంటుందని, అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించు కోవాలని కోరారు. www.tsrtconline.in ద్వారా లేదా మీకు సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం కూడా ఉంటుందని రీజినల్ మేనేజర్ పేర్కొన్నారు.

## గుంతల రోడ్లు.. విద్యార్థులకు పాట్లు..





రాళ్ల సహాయంతో నీటిగుంతలను దాటుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

*ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారాయి. చిన్నపాటి వర్షానికి గుంతల్లో నీరు నిలువడంతో రోడ్డు గుండా పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.*

*– ఆర్మూర్‌టౌన్, జూలై 9*

### ఎల్లారెడ్డి బల్దియాలో నెగ్గిన అవిశ్వాసం

# కాంగ్రెస్‌కు షాక్..

**మున్సిపల్ చైర్మన్ పదవి కోల్పోయిన సత్యనారాయణ**



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, జూలై 9: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచి మున్సిపల్ చైర్మన్‌గా పదవిలో కొనసాగుతున్న కుడుముల సత్యనారాయణ పదవికాలం ముగిసే ఐదు నెలల ముందుగానే పదవీచ్యుతుడు కావడం చర్చనీయాంశంగా మారింది. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లో ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లుగా గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ బాలమణి చేరడంతో బీఆర్ఎస్ బలం 10కి పెరిగింది. దీంతో బీఆర్ఎస్ తరఫున ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా సత్యనారాయణను ఎన్నుకున్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సత్యనారాయణ పార్టీ మారారు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లతోపాటు మరో ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. దీంతో మే 18న అధికారులు తీర్మాన సమావేశం నిర్వహించగా, మున్సిపల్ చైర్మన్ హైకోర్టుకు వెళ్లడంతో ఫలితాన్ని ప్రకటించలేదు. రెండు రోజుల క్రితం హైకోర్టు స్టేను కొట్టివేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం అవిశ్వాస తీర్మాన ఫలితాన్ని ప్రకటించారు.

### మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై మెజారిటీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ వెల్లడించారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 18న ఓటింగ్ నిర్వహించగా 11మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికినట్లు తెలిపారు. నూతన చైర్మన్‌ను ఎన్నుకునే విషయమై ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు ఉన్నారు.

# ఏటీఎంనే ఎత్తుకెళ్లారు

### లాకర్ తెరుచుకోలేదని మిషన్ అపహరణ

బిచ్కుంద, జూలై 9: ఏటీఎంను కొల్లగొట్టాలనుకున్న దొంగలకు లాకర్ తెరవడం సాధ్యం కాలేదు. దీంతో ఏకం గా ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. మాస్కులు ధరించిన దుండుగులు తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో ఎస్‌బీఐకి చెందిన ఏటీఎం సెంటర్‌లోకి చొరబడ్డారు. సీసీ కెమెరాలపై స్ప్రే చేసి, ధ్వంసం చేసి, ఏటీఎంను తెరిచేందుకు యత్నించా రు. అయితే, ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకునే లోపు దొంగలు ఏ టీఎం మిషన్‌తో సహా ఉడాయించా రు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయ ణ, సీఐ నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు మ హారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు పోలీసులను అప్రమత్తం చేశారు. ఏటీఎంలో రూ. 3.95 లక్షల నగదు ఉన్న ట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. మరోవైపు, జుక్కల్ మండలంలోని పెద్ద గుల్లా గ్రామ శివారులో అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని బిచ్కుంద ఠాణాకు తరలించారు. అయితే, దొంగలే ఆ వాహనాన్ని వదిలి మరో వాహనంలో ఏటీఎంను తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## పాముకాటుకు చిన్నారి బలి

### వృద్ధుడి పరిస్థితి విషమం



వైష్ణవి(ఫైల్)

నాగిరెడ్డిపేట, జూలై 9: హాయిగా నిద్రిస్తున్న తాత, మనుమరాలిని పాము కాటు వేయగా.. చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోడు శంకరయ్య కుమారుడు సంగమేశ్వర్‌కు ముగ్గురు కుమార్తెలు. సోమవారం రాత్రి భోజనం చేసిన అనంతరం వైష్ణవి(7) తాత శంకర య్య దగ్గర నిద్రించగా.. అమ్మమ్మ వద్ద మరో ఇద్దరు నిద్రించారు. రాత్రి మూడు గంటల సమయంలో తనను ఏదో కరిచిందని వైష్ణవి తెలుపడంతో దుప్పట్లను తీసి చూడగా.. కట్లపాము కనిపించింది. అప్పటికే అది శంకరయ్యను కూడా కాటేసింది. వైష్ణవి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో వైష్ణవి మృతిచెందింది. శంకరయ్య పరిస్థితి విషమంగా ఉన్నదని గ్రామస్తులు తెలిపారు. వైష్ణవి ఎల్లారెడ్డిలోని బ్రిలియంట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నది.